ఓవరాల్ చాంపియన్లుగా జిల్లా రెజ్లర్లు



పతకాలతో రెజ్లర్లు

మణికొండ: అండర్ 23 రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలలో అత్యధికంగా 15 పతకాలను సాధించి జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. సోమవారం హైదరాబాద్ నగరంలోని యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న గ్రౌండ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా క్రీడాకారులు మొత్తం 6 బంగారు, 4 సిల్వర్, 5 రజిత పతకాలను సాధించారని కోచ్ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. అందులోని ఆరు మంది క్రీడాకారులు 26వ తేదీ నుంచి అస్సాంలో జరిగే జాతీయ పోటీలకు ప్రమోట్ అయ్యారని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదయ్య, కార్యదర్శి కృష్ణ, సుధాకర్ యాదవ్, జిల్లా కోచ్‌లు పాండు, రాజ్‌కుమార్‌లు అభినందించారు.

ఫారెస్ట్ కార్పొరేషన్ అభివృద్ధి పనులపై సమీక్ష

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య సోమవారం సమీక్షించారు. ఫారెస్ట్ కార్పొరేషన్ చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులు ఆయనకు వివరించారు. నర్సరీలు, బీడీ ఆకులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని బాధ్యతగా స్వీకరించాలన్నారు.

పీరం చెరువు.. పట్టించుకోరు.!

చెరువులో కలుస్తున్న మురుగు

- పేరుకే దత్తత.. అభివృద్ధి నిల్
- బఫర్ జోన్లో అక్రమ నిర్మాణాలు



పీరంచెరువు లోకి నేరుగా వెలుతున్న వ్యర్థ జలాలు

బండ్లగూడ: ఓ వైపు చెరువుల సుందరీకరణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుంటే..మరోవైపు అధికారుల సమన్వయ లోపంతో అభివృద్ధి చేయడంలో విఫలమవుతున్నారు. గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే 34.20 ఎకరాల్లో ఉన్న పీరంచెరువు గతంలో ప్రజలకు తాగునీరు అందించింది.కానీ నేడు ఆ చెరువుకు రక్షణ కరువైంది.

కలుషితమైన చెరువు

చుట్టుపక్కల కొత్తగా వెలిసిన హోటళ్ల నుంచి వచ్చే మురుగునీరు నేరుగా చెరువులో కలుస్తుండటంతో పాటు చెత్తా-చెదారాన్ని పడేస్తుండటంతో చెరువు దుర్గంధ పూరితంగా మారింది. చుట్టుపక్కల కాలనీ వాసులు, గ్రేటెడ్ కమ్యూనిటీ వాసులు దుర్వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకుంటామన్న ప్రజాప్రతినిధులు, అధికారులు హామీలు ఏ మాత్రం నెరవేర్చలేదు. పట్టించుకోవాల్సిన యంత్రాంగం తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే చెరువు మరో హుస్సేన్ సాగర్ అవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోకి మురుగునీరు రాకుండా చర్యలు చేపట్టవలసిందిగా వారు కోరుతున్నారు.

అభివృద్ధి శూన్యం..

ఓ రియల్ వ్యాపార సంస్థ పీరంచెరువు సమీపంలో భారీ నిర్మాణాలు చేపడుతుంది. చెరువు సమగ్ర అభివృద్ధి, సుందరీకరణ కొరకు హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ నుంచి పీరంచెరువు దత్తతకు ఇచ్చినట్టుగా రెండు సంవత్సరాల క్రితం చెరువు చుట్టు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిపై చెరువు చుట్టు పచ్చదనం, వాకింగ్‌ట్రాక్, స్ట్రీట్ లైటింగ్, ఫర్నిచర్ మరియు పిల్లలకు ఆట పరికరాలను అమర్చడం వంటివి చేస్తామని వాటిపై ఉంది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి చేయలేదని త్వరలో చెరువు అభివృద్ధి పనులు మొదలు పెట్టాలని వారు కోరుతున్నారు.



చెరువు కట్టపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణాలు..

పీరంచెరువు బఫర్ జోన్ ప్రాంతాల్లో అడ్డగోలు నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు అడ్డగోలుగా ఎన్ఓసీలు మంజూరు చేస్తున్నారు. ఇప్పటివరకు చెరువు చాల భాగం ఆక్రమణకు గురైంది. దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవలసిందిగా స్థానికులు కోరుతున్నారు.



చెరువులో.. పశువులు



బఫర్ జోన్‌లో నిర్మాణాలు



చెరువు చుట్టు భారీ నిర్మాణాలు

తొండుపల్లి ఫ్లైఓవర్ త్వరగా పూర్తి చేయాలని వినతి



శంషాబాద్: మంత్రి కోమటిరెడ్డికి కాంగ్రెస్ నేతలు సోమవారం తొండుపల్లి వద్ద ఘనస్వాగతం పలికారు. జడ్చర్ల పర్యటనకు బయలుదేరిన ఆయన స్థానికంగా కాంగ్రెస్ నేతలను కలిశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం తొండుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణం నత్తనడకన సాగుతున్న విషయాలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆర్అండ్‌బీ డీఈతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు మరోమారు సమీక్షించనున్నట్లు స్థానిక కాంగ్రెస్ నేతలకు తెలిపారు.

పిల్లలను అంగన్‌వాడీలకు పంపాలి



అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడలోని అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీలో మేయర్ పాల్గొని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలలకు తల్లిదండ్రులు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హన్మంత్, ఆర్‌పీ వనజ, అంగన్‌వాడీ టీచర్లు వి.నాగలక్ష్మి, షాలిని, సరస్వతి, రాజేశ్వరి, లలిత, విజయ, సరిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తాం



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ ఉప కమిషనర్ రవి కుమార్

రాజేంద్రనగర్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ వెల్లడించారు. సోమవారం వివిధ శాఖల అధికారులతో ఆయన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన 4 ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసినట్లు వెల్లడించారు. అధికారులు, సిబ్బంది ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి పరిష్కరిస్తారని వెల్లడించారు.

పల్లెచెరువు బస్తీలలో కార్పొరేటర్ పర్యటన



పల్లెచెరువు బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: బోనాల సందర్భంగా చేపట్టాల్సిన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం డివిజన్ పరిధిలోని పల్లెచెరవు, హరిజన బస్తీలలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. వచ్చే బోనాల ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొకుండా తగిన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలందరు బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ నరసింహ మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, సంగీతా, మహేందర్, రఘు, లోక్ నాథ్ స్థానికులు క్రిష్ణ, కృపాకర్, ఎన్ను శంకర్ రెడ్డి, పాండు యాదవ్, టి చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడలో అమ్మ మాట- అంగన్‌వాడీ బాట



బండ్లగూడలో నిర్వహించిన ర్యాలీలో మేయర్ లతాప్రేమ్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు

బండ్లగూడ: అంగన్‌వాడీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గర్భిణీస్త్రీలు, బాలింతలు, పిల్లలు, పూర్వ ప్రాథమిక విద్యార్థులకు అమ్మ మాట అంగన్‌వాడీ బాట అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మేయర్ లతాప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలు ఇబ్బందులు పడుతున్న ప్రధాన సమస్య అయిన బాత్‌రూమ్‌లు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, సరస్వతీ, శాలిని, మెప్మా రిసోర్స్ పర్సన్ జి.వనజ, ఆశావర్కర్లు జి.విజయ పాల్గొన్నారు.

స్థలాన్ని కాపాడాలని కలెక్టర్‌కు వినతి



కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం సమర్పిస్తున్న విఘ్నేశ్వర కాలనీ వాసులు, తోకల శ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ: ప్రభుత్వ స్థలాన్ని ప్రజలందరికి ఉపయోగపడేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గంధంగూడ విఘ్నేశ్వర కాలనీలోని 17 గుంటల ప్రభుత్వ స్థలంలో ఓ కమ్యూనిటీకి శ్మశానవాటిక ఏర్పాటు కోసం 2016లో కలెక్టర్ పర్మిషన్ ఇచ్చినట్లు చెప్తున్నారని దీనిలో నిజాలు లేవన్నారు. ఈ స్థలాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు తోకల శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తేవడంతో సోమవారం కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రను కలిసి సమస్యను వివరించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విఘ్నేశ్వర కాలనీతో పాటు స్థానికంగా అనేక కాలనీల ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. ఈ స్థలంలో శ్మశానవాటిక ఏర్పాటు కోసం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. కాలనీ వాసులకు అండగా ఉంటానని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రశాంత్ నాయక్, మహాలింగంగౌడ్, పీఎస్ మల్లారెడ్డి, మహేష్ యాదవ్, నరేష్ యాదవ్, గోపి, ప్రశాంత్ నాయక్, కె.నర్సింహ్మా, గణేష్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

మణికొండ: రూ.50 కోట్లకు పైగా ధర పలికే భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ ఆధీనంలో ఉంది. కానీ అది తమదంటే తమదని రెండు రియల్టర్‌ల గ్రూపులు వాగ్వాదం చేసుకుంటున్నారు. సోమవారం ఒకరు అందులో కంటైనర్, సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న గండిపేట తహసీల్దార్ తమ సిబ్బందిని అక్కడకు పంపగా అప్పటికే వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 324లో 10 ఎకరాల కాందీశీకుల భూమి ఉంది. అది ప్రస్తుతం కోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వ పరమైంది. అలాంటి భూమిపై తమకు హక్కులు ఉన్నాయని రెండు వర్గాలు పత్రాలు చూపించి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నాయి. ఆ విషయం తెలుసుకుని తమ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లను అక్కడకు పంపగా అప్పటికే వారు వెళ్లిపోయారు. అందులో ఓ వర్గం కంటైనర్, సెక్యూరిటీని ఏర్పాటు చేసుకున్నారు. వారి వివరాలు తెలియక పోవటంతో గుర్తు తెలియని వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మణికొండ: వజ్రోత్సవ వనమహోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటికి మంగళవారం నుంచి మొక్కలను పంపిణీ చేయాలని, రోడ్ల మధ్యన, ప్రభుత్వ భూముల్లో పెద్ద ఎత్తున మొక్కలను నాటాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమీషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డు అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రాబోయే వర్షాలను దష్టిలో ఉంచుకుని అంటు వ్యాధులు ప్రబలకుండా అన్ని వార్డులలో సకాలంలో బ్లీచింగ్ పౌడర్ చల్లటం, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. రోడ్ల పక్కన ఎక్కడా చెత్త, చెదారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ జి.వి జయబాబు, డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్, టీపీఎస్ మణిహారికలతో పాటు వార్డు అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



శంషాబాద్: శంషాబాద్ కూరగాయల మార్కెట్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఎస్. సుభాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొనమొల్ల దేవేందర్, ఉపాధ్యక్షులుగా జి.బి. సంజీవరావు, కార్యదర్శిగా శివశంకర్, కోశాధికారి మేకల సిద్ధులు, సలహాదారులుగా సతీష్‌రెడ్డి, ఎం.రత్నం, ఆర్.మల్లేష్, కృష్ణారెడ్డి, బుగ్గయ్య, యాదగిరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ వ్యాపారులు ఘనంగా సన్మానించారు. మార్కెట్ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

'ప్రజలతోనే పార్టీ కొనసాగుతుంది'

నాయకులతో కాదు



సదాన శ్రీనివాస్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పార్టీ సీనియర్ నాయకుడు సదాన శ్రీనివాస్ రెడ్డి సోమవారం శివరాంపల్లిలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రజలతోనే పార్టీ కొనసాగుతుందని.. నాయకులతో పార్టీ ఎప్పుడూ సాగదని, తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పార్టీ మారినంత మాత్రాన నియోజకవర్గంలో పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. పార్టీ బలోపేతం కోసం తాము మరింత కృషి చేస్తామని అన్నారు. ప్రజల్లో పార్టీకి మంచి ఆదరణ ఉందని.. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజల పక్షాన నిలబడతామని తెలిపారు.

వృక్ష సంపదను రక్షించాలి



పచ్చదనం, మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అత్తాపూర్: మానవ మనుగడ, సర్వ జీవుల సుఖ జీవనానికి వృక్ష సంపదను రక్షించాలని రాజేంద్రనగర్ డివిజన్ రెవెన్యూ అధికారి వెంకట్ రెడ్డి అన్నారు. పచ్చదనం పరిశుభ్రత, మొక్కల పెంపకంపై అత్తాపూర్ నారాయణ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా నారాయణ పాఠశాల జోన్ ఏజీఎం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...నీడ, పూలు, ఫలాలు ఇవ్వడం మాత్రమేకాకుండా ప్రాణవాయువును నిరంతరం విడుదల చేస్తూ చెట్లు జీవకోటికి గొప్పమేలు చేస్తున్నాయని అన్నారు. ప్రిన్సిపాల్ మధుమతి మాట్లాడుతూ... మన తెలంగాణ రాష్ట్రంలో 24శాతం మాత్రమే పచ్చదనం ఉందని దానిని కనీసం 60శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకట్ రెడ్డితో పాటు ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మధుమతి, వైస్ ప్రిన్సిపాల్ తులసీ, విద్యాదేవి, నైల, ఏవో సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వారికి గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

శంషాబాద్: మోసం చేసిన వారికి భవిష్యత్‌లో గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ సీనియర్ నేత కార్తీక్‌రెడ్డి అన్నారు. శంషాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేలకు వారి నియోజకవర్గంలో అన్నింటిలో ప్రాధాన్యం కల్పించారన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఊహించని అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. అలాంటి పార్టీకి కష్టకాలంలో మోసం చేస్తున్న నేతల తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించి.. ఇక్కడ ప్రజల వాణిగా ఉన్న గులాబీ పార్టీని ఖతం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీతో పాటు ఓ సీమాంధ్ర పార్టీ కుట్ర చేస్తున్నాయన్నారు. ఆంధ్రాలో ప్రాంతీయ పార్టీలు ఉండొచ్చు కానీ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఇక్కడ మాత్రం బీఆర్ఎస్ ఉండకూడదనే దుర్మార్గం ఆలోచనల్లో కొన్ని పార్టీలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో రూ. 3 వేల కోట్ల అభివృద్ధి చేసినట్లు చెప్పిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరడానికి కారణం ఏంటో ప్రజలకు తెలపాలన్నారు. పార్టీ మార్పుకు భూముల కబ్జాలే కారణమని నియోజకవర్గంలో చర్చించుకుంటున్నారన్నారు. నియోకవర్గ కార్యకర్తలు మనోస్థైరాన్ని కోల్పోవద్దని పార్టీకి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో శంకర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, కొనమొల్ల శ్రీనివాస్, చిన్నగండు రాజేందర్, మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు





హోమంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: వారాహిమాత నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు దేవాలయాల్లో ఉత్సవాల ముగింపు సందర్భంగా హోమాలు, సామూహిక కుంకుమార్చన, పూజలు, భజన కార్యక్రమాలను ప్రారంభించారు. రాజేంద్రనగర్, బుద్వేల్, శివరాంపల్లి, ఆరాంఘర్, ఎర్రబోడ, ఉప్పర్‌పల్లి ప్రాంతాల్లోని దేవాలయాల్లో నిర్వహించిన పూజల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. వారాహి దేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

ప్రభుత్వ భూమి కబ్జాలపై ఫిర్యాదు



జిల్లా రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

శంషాబాద్ రూరల్: మండలంలోని సంఘీగూడలో ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి రక్షించాలని కోరుతూ జిల్లా కలెక్టరు శశాంక్‌కు బీజేపీ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 118లో ఏడు ఎకరాల 28 గుంటల ప్రభుత్వ భూమి ఉండగా.. అందులో కొందరు అక్రమంగా కబ్జాలు చేపట్టారని పేర్కొన్నారు. కబ్జాలను అడ్డుకున్న బీజేపీ నాయకులపై అధికారులు అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఫిర్యాదును కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ అధికారి భూపాల్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం పార్టీ ఇంఛార్జి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు అంజన్ కుమార్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, నాయకులు మహాలింగం, బల్వంత్, శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌యాదవ్, జనార్దన్, అశోక్‌యాదవ్, యాదయ్య, దనరాజ్, మల్లేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డి నగర్‌లో రానున్న బోనాల ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఆలయం ముందు గుంతలతో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. గతంలో స్థానిక యూత్ అసోసియేషన్ సభ్యులు రమేష్ రెడ్డి కార్పొరేటర్ దృష్టికి సమస్యను తీసుకెళ్ళడంతో వెంటనే జీహెచ్ఎంసీ అధికారులను మంజూరు చేయాలని ఆదేశించడంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. దీంతో స్థానిక ప్రజలు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ కమిటీ సభ్యులు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్, రమేష్, శంకర్, శేఖర్ తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులను ప్రోత్సహిస్తాం



విద్యార్థులకు బ్యాగులను అందించిన వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు తమ వంతు చేయూతను అందించి ప్రోత్సహిస్తామని మణికొండ మున్సిపాలిటీ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. సోమవారం ఆయన తమ అసోసియేషన్ తరఫున నెక్నాంపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను అందజేశారు. సేవా కార్యక్రమాల్లో తమ సంస్థ ఎప్పుడూ ముందు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిష్, మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీలకు హాస్టళ్లను నిర్మించాలి



ఫహీం ఖురేషిని కలిసిన మహ్మద్ గౌస్ అలీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మైనార్టీ గురుకుల సంక్షేమ హస్టళ్లను నిర్మించాలని రాష్ట్ర మైనార్టీ గురుకుల సంక్షేమ శాఖ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషిని కోరినట్లు డివిజన్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షులు మహ్మద్ గౌస్ అలీ వెల్లడించారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... సోమవారం వైస్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో దాదాపు రెండు లక్షల మంది మైనార్టీ జనాభా ఉందన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా హస్టళ్లను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి



గెలుపొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న మేనేజర్

అత్తాపూర్: రాజేంద్రనగర్ డీపోలో జూలై నెలకు సంబంధించి లక్షే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఉద్యోగుల మనోవికాసాన్ని, పోటీతత్వాన్ని పెంచడానికి 100 మీటర్స్ రన్నింగ్, 400 మీటర్స్ ఫాస్ట్ వాకింగ్, మ్యూజికల్ చైర్, బాస్కెట్ బాల్, మెహందీ విభాగాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, ఎస్‌టిఐ సుశీల, డిపోలోని ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.